News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK చంద్రకాంత్ NEWS
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :117 | ఖమ్మం | శుక్రవారం, జూన్ 13, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



# కుప్పకూలిన ఎయిరిండియా విమానం
## 265 మంది మృతి

- అందులోని 229 మంది ప్రయాణికులు.. 12 మంది సిబ్బంది దుర్మరణం
- వైద్యకళాశాల సముదాయంపై పడటంతో మరో 24 మంది మృత్యువాత
- మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ
- విమానం నుంచి ప్రాణాలతో బయటపడింది ఒక్కరే
- లండన్‌కు బయల్దేరిన నిమిషాల్లోనే దుర్ఘటన

వివరాలు 2లో..


## సుస్థిరాభివృద్ధి.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం
### గ్రీన్ కో సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), గ్రీన్ కో సంయుక్త ఆధ్వర్యంలో 14వ గ్రీన్ కో సమ్మిట్‌ను గురువారం నిర్వహించగా ఆయన వివరాలు 2లో..

## బాధ్యత లేకుండా వేలమందిని వెంటేసుకుని వెళ్లి పొదిలిలో హంగామా చేశారు

- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం
- వైసీపీ కుట్రలతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేయాలని చూస్తోందని ఆరోపణ
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం
- అమరావతిపై వ్యాఖ్యలు, పొదిలి ఘటనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం
- ఇప్పటివరకు తన మంచితనమే చూశారని, ఇకపై ఉపేక్షించబోనని తీవ్ర హెచ్చరిక
- పొగాకు రైతులకు క్వింటాకు రూ.12 వేలు ఇస్తున్నామని వెల్లడి



ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం నాడు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా భద్రత, శాంతిభద్రతలకు ఎవరు విఘాతం వివరాలు 2లో..



## ఏడాదిలో విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం ప్రారంభమైంది

- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉందన్న మంత్రి
- గడచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో తీసుకువచ్చామని వ్యాఖ్య
- దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నామన్న మంత్రి
- బాబు సూపర్ సిక్స్ లో 'తల్లికి వందనం' హామీ నిలబెట్టుకున్నామని వెల్లడి
- సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దుల బండి అన్న లోకేశ్
- ప్రజల ఆశలు నెరవేర్చే బాధ్యత తమపై ఉందని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై మంత్రి నారా లోకేశ్ విలేకరుల సమావేశం

వివరాలు 2లో..

## చార్మినార్, ఫలక్‌నుమా వద్ద మెట్రో పనులకు బ్రేక్ హైకోర్టు కీలక ఆదేశాలు!


- హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులకు హైకోర్టు తాత్కాలిక బ్రేక్
- చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ దగ్గర పనులు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు
- వారసత్వ కట్టడాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ పిల్
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వరకు నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం
- యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం

వివరాలు 2లో..



## హైదరాబాద్‌లో భారీ వర్షం

- హైదరాబాద్‌లో గురువారం రాత్రి భారీ వర్షం
- ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన
- లోతట్టు ప్రాంతాలు నీట మునక, రోడ్లపై వరద
- ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారుల అవస్థలు
- రాష్ట్రంలో మరో ఐదు రోజులు వర్షాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడి
- చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావం



హైదరాబాద్ నగరవాసులను గురువారం రాత్రి భారీ వర్షం ముంచెత్తింది. ఏమాత్రం ఊహించని విధంగా ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన నగరంపై విరుచుకుపడటంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ ఆకస్మిక వర్షం కారణంగా నగర జీవనం స్తంభించిపోయింది. నగరంలోని హయత్‌నగర్, ఉప్పల్, కోఠి, తార్నాక, సికింద్రాబాద్ వంటి తూర్పు, మధ్య ప్రాంతాలతో పాటు బంజారాహిల్స్, అమీర్‌పేట, సనత్ నగర్ వంటి పశ్చిమ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈ కుండపోత వాన ధాటికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అనేక రహదారులపై పెద్ద ఎత్తున వరద వివరాలు 2లో..

## మానసికంగా చచ్చిపోయాను
### పేర్ని నాని కంటతడి



- తన కుటుంబాన్ని వేధిస్తున్నారన్న పేర్ని నాని
- నమ్మిన వ్యక్తే తనను మోసం చేశాడని ఆవేదన
- తన పరిస్థితి పగవాడికి కూడా రాకూడదని వ్యాఖ్య

వివరాలు 2లో..

## పోచంపల్లి వస్త్రాలు.. సాంస్కృతిక చిహ్నాలు

మరింత ప్రాచుర్యం కల్పించేందుకు చర్యలు
రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



పోచంపల్లిలో తయారయ్యే ఇక్కత్ వస్త్రాలు కేవలం చేనేత ఉత్పత్తులు మాత్రమే కాదని.. అవి దేశానికి సాంస్కృతిక చిహ్నాలని రాష్ట్ర గవర్నర్ వివరాలు 2లో..

# కుప్పకూలిన ఎయిరిండియా విమానం

అహ్మదాబాద్: గగనంలో ఘోరం.. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమా నం గురువారం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది. మధ్యాహ్నం 1.38 గంటలకు టేకాఫ్ అయిన విమానం ఇంకా విమానాశ్రయానికి దగ్గర్లో ఉన్నప్పుడే ఏదో సమస్య తలెత్తడంతో పైలట్లు పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించే 'మేడే కాల్' ఇచ్చారు. అది అకస్మాత్తుగా కిందికి దిగిపోవడం మొదలైంది. పైలట్లతో సంప్రదించడానికి గగనతల రద్దీ నియంత్రణ (ఏటీసీ) విభాగం ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదు. తిరిగి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు ప్రయత్నించిన ఏఐ171 విమానం.. అత్యంత తక్కువ ఎత్తుకు వచ్చి, కొన్ని సెకన్లలోనే విమానాశ్రయ

వెలుపల మేఘానీనగర్‌లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస ప్రాంతం వద్ద కూలిపోయింది. అగ్నిగోళాన్ని తలపించేలా మంటలు చెలరేగాయి.

దట్టమైన నల్లని పొగలు అలముకున్నాయి. దుర్ఘటన జరిగినప్పుడు విమానంలో 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు సహా 12 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒక్క ప్రయాణికుడు గాయాలతో బయటపడగా మిగిలినవారంతా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ (68) కూడా ఉన్నారు. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు ఆయన వెళ్తున్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది.

**మెడికోలు సహా పౌరులపై మృత్యుపంజా**

విమానం కూలిన ప్రాంతంలోని బీజే వైద్య కళాశాల మెడికోల వసతి గృహ సముదాయం బాగా ధ్వంసమై, 24 మంది మృత్యువాత పడ్డారని భావిస్తున్నారు. వారిలో ఎక్కువమంది మెడికోలు. మృతుల సంఖ్యను అధికారికంగా బయటపెట్టలేదు. ప్రమాద దృశ్యాన్ని మొబైల్ ఫోన్లో ఒకరు రికార్డు చేయగా అది నిమిషాల్లో వైరల్ అయింది. ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'విమాన ప్రమాదాల దర్యాప్తు మండలి' (ఏఏఐబీ) ద్వారా విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో డీఎన్‌యే పరీక్ష ద్వారా వాటిని గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించాలని నిర్ణయించినట్లు అమిత్ షా చెప్పారు. రాత్రి పొద్దుపోయే సమయానికి 265 మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అహ్మదాబాద్‌లో లోహ విహంగాలు ఇంత భారీ ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. 1988 అక్టోబరు 19న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఈ విమానాశ్రయంలో దిగుతూ కుప్పకూలగా దానిలో ఉన్న 130 మందీ మృత్యువాత పడ్డారు.

**అనంతరం అలముకున్న పొగ**

**625 అడుగుల ఎత్తులో ఉండగా..**

'ఫ్లైట్ రాడార్ 24' ప్రకారం లండన్ విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. మధ్యాహ్నం 1.39 సమయంలో పూర్తిగా కిందికి దిగిపోతూ మొదట ఓ చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. విమానంలో ఒక భాగం ఓ ఐదంతస్తుల భవంతిని ఢీకొట్టింది. ఆ సమయంలో పేలుడులాంటి శబ్దం వినిపించిందని, అప్పుడే విమానానికి, భవనానికి మంటలు అంటుకున్నాయని ప్రత్యక్ష సాక్షి తెలిపారు. ఈ బోయింగ్ డ్రీమ్ లైనర్‌లో 300 మంది ప్రయాణించవచ్చు. ఇది 11 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. 6,817 కిలోమీటర్ల ప్రయాణం కావడంతో విమానంలో 1,25,000 లీటర్ల పైచిలుకు ఇంధనం ఉంది. దీనికి మంటలు అంటుకోవడంవల్ల ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని, విపరీతమైన వేడి కారణంగా ఇంకెవరూ ప్రాణాలతో మిగిలే అవకాశం లేదని అమిత్‌షా చెప్పారు. దుర్ఘటనలో మరికొన్ని భవనాలూ దెబ్బతిన్నాయి. కొన్నింటికి మంటలు వ్యాపించాయి. కార్లు సహా పలు వాహనాలు కాలిపోయాయి. ఘటనా స్థలానికి అగ్నిమాపక శకటాలు, ఎన్డీఆర్ఎఫ్ బలగాలను తరలించారు. మృతుల కుటుంబ సభ్యులను అహ్మదాబాద్‌కు తీసుకువెళ్లేందుకు దిల్లీ, ముంబయి నుంచి ఒక్కో ప్రత్యేక విమానాన్ని ఎయిరిండియా ఏర్పాటు చేసింది.

**రూ.కోటి చొప్పున పరిహారం**

ప్రమాద ఘటనపై ఎయిరిండియా ఛైర్‌పర్సన్, టాటా సన్స్ గ్రూపు ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. "ప్రమాద ఘటన తీవ్రంగా కలచివేసింది. ఆ బాధను వ్యక్తపరచడానికి మాటలు కూడా రావడం లేదు. ప్రమాదంలో ప్రియమైనవారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి గ్రూపు తరఫున రూ.కోటి చొప్పున అందజేయనున్నాం. గాయపడిన వారి వైద్య ఖర్చులను కూడా మేమే భరిస్తాం. వారి సంరక్షణ బాధ్యత కూడా మాదే. బీజే మెడికల్ హాస్టల్ నిర్మాణానికి మా వంతుగా తోడ్పాటు అందిస్తాం" అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు.

**పైలట్‌కు సుదీర్ఘ అనుభవం**

ప్రమాదానికి గురైన విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) తెలిపింది. సుమిత్‌కు 8,200 గంటలు, కుందర్‌కు 1,100 గంటల పాటు విమానాలను నడిపిన అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ప్రమాదానికి కారణాలు తెలుసుకునేందుకు బ్లాక్‌బాక్స్ కోసం అన్వేషిస్తున్నారు. దీనిలో ఉండే ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లను విశ్లేషిస్తే ఈ ప్రమాదం ఎందువల్ల జరిగిందో, ముఖ్యంగా చివరి క్షణాల్లో ఏమైందో తెలుస్తుంది.

**ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు**

**మృత్యుంజయుడు విశ్వాస్‌కుమార్**

**విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ విశ్వాస్ కుమార్ రమేశ్**

విమానంలో 11-ఏ సీటులో కూర్చొన్న విశ్వాస్‌కుమార్ రమేశ్ అనే ప్రయాణికుడు అనూహ్యరీతిలో ప్రాణాలతో బయటపడ్డారు. గుజరాత్‌లో ఉన్న తన కుటుంబాన్ని కలిసేందుకు బ్రిటన్ నుంచి విశ్వాస్ రాగా.. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. విశ్వాస్ సోదరుడు కూడా ఆ విమానంలో ఉన్నప్పటికీ ఆయన ఆచూకీ తెలియరాలేదు. కాగా ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణికుల సమాచారం కోసం 1800 5691 444 నంబరుతో హాట్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ప్రమాదం తర్వాత అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని కొన్నిగంటలపాటు మూసివేశారు. దాంతో కోల్‌కతా నుంచి చేరాల్సిన ఇండిగో విమానం తిరిగి వెనక్కిమళ్లింది. రాత్రి విమానాశ్రయాన్ని తెరిచారు. సహాయక చర్యల పర్యవేక్షణకు దిల్లీ, అహ్మదాబాద్‌లలో కంట్రోల్‌రూంలు ఏర్పాటుచేశారు. ఘటనపై దర్యాప్తునకు బ్రిటన్ సయితం ఒక బృందాన్ని పంపించింది.

**బాధ్యులను వదలం**

ఈ ప్రమాదం మహా విషాదం. ప్రధాని మోదీ దీనిపై ఆరాతీసి, ఆదేశించిన మేరకు విజయవాడ నుంచి వెంటనే అహ్మదాబాద్‌కు వచ్చాను. ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుల్లో విదేశీయులు, పిల్లలు ఉన్నారు. దేశాన్ని వణికించిన దుర్ఘటన ఇది. బాధ్యులెవరినీ వదలం. ప్రమాదం ఎందుకు జరిగిందో అన్నికోణాల్లో లోతైన, నిష్పాక్షికమైన దర్యాప్తు చేస్తాం.

**రేవంత్‌రెడ్డి, చంద్రబాబు దిగ్భ్రాంతి**

అహ్మదాబాద్‌లో గురువారం ఎయిర్ ఇండియా విమానం కూలిపోయినదుర్ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రయాణికులు, వైద్య విద్యార్థుల మృతిపై తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులను, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గుజరాత్, కేంద్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. దుర్ఘటనపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు సంతాపం తెలిపారు.

విమాన ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నట్టు వెల్లడించారు. ప్రమాదంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీవ్ర విచారం ప్రకటించారు. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీస్తున్నట్లు కిషన్‌రెడ్డి, సంజయ్ పేర్కొన్నారు. వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. విమాన ప్రమాదం పట్ల భారాస అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. ప్రమాదంపై భారాస సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం తెలిపారు.

# చార్మినార్, ఫలక్‌నుమా వద్ద మెట్రో పనులకు బ్రేక్

హైదరాబాద్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెట్రో రైలు రెండో దశ పనులకు వారసత్వ కట్టడాల వద్ద అవరోధం ఎదురైంది. చారిత్రక చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో ఎలాంటి మెట్రో నిర్మాణ పనులు చేపట్టరాదని తెలంగాణ హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశలో భాగంగా కారిడార్-6 పనులను వారసత్వ కట్టడాల పరిరక్షణకు సంబంధించి ఎలాంటి అధ్యయనం చేపట్టకుండానే ప్రారంభిస్తున్నారని యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, మెట్రో రెండో దశ పనుల వల్ల చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్‌తో పాటు పురానీ హవేలీ, దారుల్‌షిఫా మసీద్, మొగల్‌పురా టూంబ్ వంటి అనేక చారిత్రక కట్టడాల భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వారసత్వ కట్టడాలపై పడే ప్రభావంపై సమగ్రమైన అధ్యయనం నిర్వహించకుండా పనులు చేపట్టడం సరికాదని ఆయన వాదించారు. హెరిటేజ్ పరిరక్షణ నిపుణులు, పట్టణ ప్రణాళికా విభాగం నిపుణులు, పర్యావరణవేత్తలు, స్థానిక ప్రజల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర కమిటీ ద్వారా అధ్యయనం చేయించాలని కోరారు.

ంతెలంగాణ వారసత్వ కట్టడాల పరిరక్షణ చట్టం, కేంద్ర పురావస్తు శాఖ చట్టంలోని నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే పనులు కొనసాగించేలా ఆదేశాలు

ఇవ్వాలని పిటిషనర్ అభ్యర్థించారు. అప్పటివరకు చారిత్రక కట్టడాల సమీపంలో మెట్రో రైలు పనులను నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ, ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి మూడు వారాల సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. తదుపరి విచారణ జరిగే వరకు చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో మెట్రోకు సంబంధించిన ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది.

# పోచంపల్లి వస్త్రాలు.. సాంస్కృతిక చిహ్నాలు

- మొదటి పేజి తరువాయి

జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. వీటికి మరింత ప్రాచుర్యం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే దిశగా అహ్మదాబాద్‌లోని ఎన్ఐడీ, ఐఐటీల సహకారంతో అధ్యయనం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గవర్నర్ తన సతీమణి సుధాదేవ్‌వర్మతో కలిసి గురువారం భూదాన్‌పోచంపల్లికి విచ్చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వారి వెంట ఉన్నారు. గవర్నర్ దంపతులు ముందుగా టూరిజం పార్కు పక్కనే ఉన్న వినోబా భావే మందిరం వీధిలో ఉన్న చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి.. వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కత్ మ్యూజియానికి వెళ్లి.. మగ్గాలపై కార్మికులు పనిచేస్తున్న తీరును పరిశీలించారు. తర్వాత సమావేశ మందిరంలో చేనేత కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. 'మా స్వస్థలం త్రిపురలో ఉన్నప్పుడు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల గురించి తరచూ వినేవాళ్లం. ఇక్కడి కార్మికులు చేతితో చీరలు తయారు చేస్తారని, మంచి నాణ్యత కలిగి ఉంటాయని చెప్పుకొనేవారు. ఉత్తరాది రాష్ట్రాల్లో చేతితో ఇంత నైపుణ్యంతో తయారు చేసే కార్మికులు తక్కువే' అని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికులకు కల్పిస్తున్న నేతన్న భరోసా, బీమా, థ్రిఫ్ట్ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాల్లో ఈ పథకాల అమలుకు కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులు పోచంపల్లి వస్త్రాలను ఫ్యాషన్ షోలో ప్రదర్శించడం వల్ల 30 శాతం అమ్మకాలు పెరిగాయంటూ కార్మికులు తనతో ప్రస్తావించారని, ఇదెంతో శుభపరిణామమని గవర్నర్ పేర్కొన్నారు. ముగ్గురు కార్మికులకు నేతన్న రుణాల కింద రూ.5 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నేతన్న పొదుపు పథకం కింద యాదాద్రి జిల్లాకు రూ.2.17 కోట్ల విలువైన చెక్కులు అందించారు. ఈ కార్యక్రమాల్లో చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఆ శాఖ ఏడీ శ్రీనివాసరావు, కలెక్టర్ హనుమంతరావు, భువనగిరి డీసీపీ అంక్షాంశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యత లేకుండా వేలమందిని వెంటేసుకుని వెళ్లి పొదిలిలో హంగామా చేశారు

- మొదటి పేజి తరువాయి

కలిగించినా చూస్తూ ఊరుకునేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందే కాకుండా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. "ఇప్పటివరకూ నా మంచితనం మాత్రమే చూశారు. ఇకపై ఉపేక్షించేది లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

"సమస్యలను అధిగమించడానికి మేము ప్రయత్నిస్తుంటే, రాక్షసుల మాదిరిగా రాష్ట్రాన్ని అతలాకుతలం చేయాలని, శాంతిభద్రతల సమస్యలు సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని రకరకాల విన్యాసాలు చేస్తున్నారు" అని చంద్రబాబు అన్నారు. నేరాలు, ఘోరాలు చేసే వారికి కొందరు అండగా నిలుస్తున్నారని, అలాంటి

వారికి ప్రజలు ఎందుకు మద్దతివ్వాలని ఆయన ప్రశ్నించారు. అమరావతిపై వైసీపీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "దేవతల రాజధాని అమరావతిని వేశ్యల నగరమా? ఎంత అహంకారం ఉంటే ఇలాంటి మాటలు మాట్లాడతారు?" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే పొదిలిలో గొడవలు సృష్టించారని, అక్కడ మహిళలపై రాళ్లదాడి చేశారని ఆరోపించారు. తెనాలిలో గంజాయి బ్యాచ్‌ను పరామర్శించడంపైనా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "బాధ్యత లేకుండా వేల మందిని వెంటేసుకుని పొదిలి వెళ్లి హంగామా చేశారు. గూండాలను తీసుకెళ్లి మహిళలపై దాడి చేసి రౌడీయిజం చేస్తారా? ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకే పరిమితం చేసినా మీకు ఇంకా బుద్ధి రాలేదా?" అని జగన్ ను నిలదీశారు.

పొగాకు రైతులకు తమ ప్రభుత్వం క్వింటాకు రూ.12 వేల ధర కల్పిస్తోందని చంద్రబాబు తెలిపారు. అయితే, బాధ్యత లేకుండా వేలాది మందిని వెంటేసుకుని పొదిలి వెళ్లి హంగామా చేశారని విమర్శించారు. "శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోను. ప్రజల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. రౌడీయిజం చేసి పెత్తనం చెలాయించాలనుకుంటే అలాంటి ఆటలు సాగనివ్వను" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- మొదటి పేజి తరువాయి

నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కార్యాలయాల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లే సమయం కావడంతో పలు ప్రధాన కూడళ్లలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నిలిచిన నీటిలో వాహనాలు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా, నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న ఐదు రోజుల పాటు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వారు వెల్లడించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కురిసిన వర్షం రుతుపవనాల క్రియాశీలతకు నిదర్శనమని, రాబోయే రోజుల్లోనూ ఇలాంటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

## సుస్థిరాభివృద్ధి.. పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

- మొదటి పేజి తరువాయి

ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాల ఉత్పత్తిలో మనది మూడో స్థానం. ప్యారిస్ ఒప్పందం కింద 2070 నాటికి నెట్ జీరో లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇది సాహసోపేత నిర్ణయం. ఇందులో భాగంగా 2030 నాటికి ఇంధన అవసరాల్లో 50శాతం పునరుత్పాదక వనరుల నుంచి తీర్చడానికి కట్టుబడి ఉన్నాం. గ్రీన్ కో ఛత్రం కింద వివిధ రంగాల్లో దేశవ్యాప్తంగా 1,500కుపైగా పరిశ్రమలు హరిత అనుకూల చర్యలు చేపట్టడం అభినందనీయం. క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ 2025 ద్వారా 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యం సాధించడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. ఇందిర సోలార్ జల్ వికాస్ పథకాన్ని రూ.12,600 కోట్లతో అమలు చేయడం ద్వారా 6 లక్షల ఎకరాలకు సౌరశక్తితో నడిచే నీటి పారుదల వ్యవస్థలను రూపొందిస్తాం. 2 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది. గ్రీన్‌కో రేటెడ్ పరిశ్రమల ద్వారా రూ.5,100 కోట్ల పొదుపు సాధ్యమైంది. అలాగే 194 మిలియన్ కిలోలీటర్ల నీటి సంరక్షణ, 5.7 మిలియన్ టన్నులకుపైగా కర్బన ఉద్గారాల తగ్గింపు, 600 మిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు గ్రీన్‌కో కృషికి నిదర్శనం" అని శ్రీధర్‌బాబు అన్నారు.

### ఏడాదిలో విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం ప్రారంభమైంది

సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దుల బండి అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కూటమి పాలన ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచి ప్రజాపాలన ఏర్పడి ఏడాది పూర్తిచేసుకుంటున్నాం. సుపరిపాలనలో తొలి అడుగు పడింది. విధ్వంస పాలన నుంచి ఏకంగా వికాసం వైపు మన ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించింది. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నాయకత్వలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. ఉద్యోగాల విషయంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోంది. డీఎస్సీని ఎట్టిపరిస్థితుల్లో ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసింది. ఈ రోజుతో 24వ కేసు కూడా సుప్రీంకోర్టులో డిస్మిస్ అయింది. అవన్నీ తట్టుకుని డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేస్తున్నాం.

**గడచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో తీసుకువచ్చాం**

గడచిన పదేళ్లలో రానిపెట్టుబడులు ఈ ఏడాది కాలంలో తీసుకురా వడం జరిగింది. రూ. 9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. డొమెస్టిక్ ఇన్వెస్ట్ మెంట్స్ లో ఏపీ భారతదేశంలోనే నెంబర్ వన్ గా ఉంది. 16శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. ఇందులో భాగంగా టీసీఎస్, ఎల్జీ, ఎన్టీపీసీ గ్రీన్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్, రిలయన్స్ రెన్యూ పవర్ లాంటి సంస్థలు ఈ రోజు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కనుకనే విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకోగలిగాం. రైల్వేజోన్ సాధించాం. అలాగే భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి.

**దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం**

ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ.వెయ్యి పెంచి రూ.4వేలు అందిస్తున్నాం. వికలాంగులకు రూ.3వేలు పెంచి రూ.6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి ప్రతినెలా రూ.15వేలు అందిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా 203 అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం జరిగింది. ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం కూడా అమలుచేస్తున్నాం. దీపం పథకం ద్వారా ఇప్పటికే 2 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రజా ప్రభుత్వం తెలుగింటి ఆడపడుచులకు అందించడం జరిగింది. గ్యాస్ పథకంలో సవరణలు తీసుకువచ్చి సదరు నగదును మహిళల బ్యాంక్ అకౌంట్లకే నేరుగా బదిలీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

**బాబు సూపర్ సిక్స్ లో తల్లికి వందనం హామీ నిలబెట్టుకున్నాం**

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం హామీ నిలబెట్టుకుంటున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలుచేస్తామని చెప్పాం. హామీ ఇచ్చిన విధంగా జీవో విడుదల చేయడం జరిగింది. ఈ రోజు నుంచి నగదు తల్లుల అకౌంట్లలో జమచేయడం జరుగుతుంది. రూ.13వేలు తల్లుల అకౌంట్లలో పడతాయి. రూ.2వేలు పాఠశాలల్లో మెయింటెన్స్ గ్రాంట్ కింద ఖర్చు చేయడం జరుగుతుంది. తల్లికి వందనం కింద దాదాపు 60శాతం కుటుంబాలు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. వారికి ఇద్దరుంటే రూ.26వేలు, ముగ్గురుంటే రూ.39వేలు వస్తాయి. వారి అకౌంట్లలోనే నగదు జమచేయడం జరుగుతుంది. బాబు సూపర్ సిక్స్ లో మరొక హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవడం జరిగింది.

## మానసికంగా చచ్చిపోయాను

:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు కృష్ణా జిల్లాలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వరకు వైసీపీ కేడర్‌పై దాడులు చేయించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాయమాటలతో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిందని పేర్ని నాని విమర్శించారు. జూన్ 4వ తేదీన గెలిచి 12వ తేదీ దాకా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయకపోవడానికి కారణం.. ఆ మధ్య రోజుల్లో వైసీపీ కార్యకర్తలపై దాడులు చేయడానికే అని ఆయన అన్నారు. టీడీపీ శ్రేణులు ఇష్టానుసారం రెచ్చిపోయాయని, జగన్ జెండా మోసిన ప్రతి కార్యకర్త ఇంట్లోకి జువ్వలు, టపాసులు కాల్చి ఇంట్లో వేసి పైశాచిక ఆనందం పొందారని, భౌతిక దాడులకు కూడా పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో సొంత టోల్ గేట్ పెట్టి డబ్బులు వసూలు చేశారంటూ కాకాణి గోవర్ధన్‌పై, బందరులో ఎవరో తలలు పగలుకొట్టారని కొడాలి నానిపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. తన మీద, తన భార్య మీద కూడా రేషన్ బియ్యం కేసు పెట్టారని నాని వాపోయారు.రేషన్ బియ్యం కేసుకు సంబంధించి పేర్ని నాని వివరణ ఇస్తూ, "నేను, నా అత్త మామలు కలిసి అద్దెకు ఇవ్వడానికి ఆ గోదాములు కట్టాం. నేను నమ్మిన వ్యక్తిని అక్కడ పెడితే... ప్రభుత్వ ఉద్యోగులు, అతను కలిసి తప్పు చేశారు. గోదాములు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బస్తాలు తరలింపులో తేడా వస్తుందని ఆ వ్యక్తి చెప్పాడు. తేడా వచ్చిన ఆ సొమ్ము కడతామని చెప్పాం. దీంతో జాయింట్ కలెక్టర్ లెటర్ రాసుకున్నారు. లెటర్ పైకి వెళ్లిన తర్వాతే అసలు కథ మొదలైంది" అని తెలిపారు. గోదాములో బియ్యం కొరత ఉంటుందని, ఫైన్ కట్టాలని జాయింట్ కలెక్టర్ చెప్పారని, రూ. కోటి 80లక్షలు కట్టాలని చెబితే, కోటి రూపాయలు అదే రోజు కట్టామని, మిగిలింది రెండు రోజుల్లో కడతామని చెప్పినా, అనూహ్యంగా అదే రోజు క్రిమినల్ కేసు పెట్టారని ఆయన వివరించారు. ఆంధ్రజ్యోతిలో వార్త వచ్చిందనే కారణంగానే కేసు పెట్టారని ఆరోపించారు. "22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పట్టుకున్నామని 'సీజ్ ద గోడౌన్' అన్నారు. కోర్టుకు వెళితే ఫైన్ కట్టించుకుని వదిలేయమని చెప్పింది" అని గుర్తు చేసుకున్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్ర పథకాలే ఆధారం.

- కేంద్ర మోదీ పథకాలతో లక్షల మందికి లబ్ధి
- పది పథకాలతో రాష్ట్రంలో బీజేపీ ముద్ర
- 'టీఆర్ఎస్-కాంగ్రెస్‌లకు అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదు
- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబన్న
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు




**సి కె న్యూస్ ప్రతినిధి:**గత పదకొండు సంవత్సరాలలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పోషించిన పాత్ర అపూర్వమని, రాష్ట్రాన్ని ముందుకు నడిపిన ప్రతి ఘట్టానికీ కేంద్ర పథకాలే ఆధారం అన్న విషయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబన్న , ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టంగా పేర్కొన్నారు. గురువారం ఖమ్మం లో మీడియాతో మాట్లాడిన వారు , కేంద్ర ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న పథకాలు లక్షలాదిమందికి నేరుగా లబ్ధిని అందించాయని తెలిపారు. రాష్ట్రంలోని టీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో స్పష్టమైన అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు.

పీఎం కిసాన్ సన్మాన్ నిధి పథకం ద్వారా రాష్ట్రంలోని 31 లక్షల 30 వేల అర్హులైన రైతుల్లో 31 లక్షల 20 వేల మందికి నిధులు బదిలీ చేయబడినట్లు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 99 శాతం నిధుల బదిలీ విజయవంతంగా జరిగిందన్నారు. ఇదే విధంగా, పీఎం ముద్రా యోజన ద్వారా 2017 నుంచి 2024 వరకు 75 లక్షల రుణ ఖాతాలు మంజూరై, 72 వేల కోట్ల విలువైన రుణాలు మంజూరు చేయబడ్డాయి. ఈ పథకాలు గ్రామీణ యువతలో స్వావలంబనకు బీజం వేశాయని అభిప్రాయపడ్డారు.

పీఎం జనధన్ యోజన కింద రాష్ట్రంలో 1.27 కోట్ల లబ్ధిదారులకు రూ.517 కోట్ల నిధులు ఖాతాల్లో ఉన్నాయి. పీఎం స్వనిధి పథకం ద్వారా నాలుగు లక్షల మందికి 1247 కోట్లు మంజూరవగా, ఇందులో 1226 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయని వెల్లడించారు. పట్టణ గిరిజన, అణగారిన వర్గాల వాసులకు, వీధివిక్రేతలకు ఇది ఆశాజ్యోతి లాంటిదని కొనియాడారు.

పీఎం ఆవాస్ యోజన (పట్టణం) ద్వారా ఇప్పటివరకు 3.6 లక్షల ఇళ్లకు మంజూరుతోపాటు, 2.4 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమై 2.2 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. దీనికోసం కేంద్రం రూ.6150 కోట్లు మంజూరు చేసి, ఇప్పటివరకు 3800 కోట్లు విడుదల చేసినట్టు వివరించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద 14331 కిలోమీటర్ల రహదారులకు మంజూరుగా 12,800 కిలోమీటర్లకు పైగా ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. అలాగే 551 వంతెనలలో 383 నిర్మాణం పూర్తయింది. ఈ పథకంపై కేంద్రం రూ.4948 కోట్లను వ్యయం చేసినట్టు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 82 లక్షల 59 వేల 718 ఆరోగ్య కార్డులు జారీ చేయబడ్డాయి. కేవలం గత 30 రోజుల్లోనే 6,268 కార్డులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అంతేకాక, జాతీయ రహదారుల విస్తరణలోనూ కేంద్రం తెలంగాణపై దృష్టిసారించిందని వివరించారు. 2019 నుండి 2025 వరకు రాష్ట్రంలో 1488 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించబడి, వాటిపై మొత్తం 19,000 కోట్లకు పైగా వ్యయం జరిగినట్టు వివరించారు.

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద మార్చి 2025 వరకు మొత్తం 11 లక్షల 84 వేల 203 గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన, పేద మహిళలకు ఈ పథకం గృహోత్సాహాన్ని కలిగించిందని వ్యాఖ్యానించారు. ఇక, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద, అంత్యోదయ అన్న పథకం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల 67 వేల కుటుంబాలకు, మొత్తం 1.90 కోట్ల మందికి అన్నధాన పథకం ద్వారా నిత్యావసర సరుకులు అందించబడ్డాయి.

నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్న విధంగా, రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలన గడిచిన 10 ఏళ్లలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ ప్రజలకు మేలు జరిగినట్లు కనిపించడంలేదని విమర్శించారు. అభివృద్ధి కేవలం కేంద్ర పథకాలతోనే సాధ్యమైందని, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని సక్రమంగా అమలు చేయడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోంగూర వెంకటేశ్వరరావు, నున్న రవికుమార్, అల్లిక అంజయ్య, గంట్యాల విద్యాసాగర్, ఉప్పల శారద, వాకదాని పుల్లారావు, గుత్తా వెంకటేశ్వర్లు, అత్తి విజయ రెడ్డి, రవి రాథోడ్, తిరుమల పల్లి విజయరాజు, కోటమర్తి సుదర్శన్, గుగులోతు నాగేశ్వరరావు,భూక్య శ్యాంసుందర్, బోయినపల్లి చంద్రశేఖర్, ఈదుల వీరభద్రం హాజరయ్యారు.

# అర్హతలు ఉన్న పేదలకు ఇల్లు రాదా!.....

- బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ నెంబర్ ఎలిమినేటి వెంకటేశం ఆరూరు గ్రామం.







**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 12.** మీడియాతో మాట్లాడుతూ. అర్హతలు ఉన్న పేదలకు ఇల్లు రాదా అని ఆయన ఆవేదన వ్యక్తం చేసినారు. అరూరు గ్రామంలో సుంకిశాల నిర్మల నరసింహ, సుంకిశాల ఉప్పలమ్మ అశోక్, పోలేపాక మంజుల మల్లయ్య, జినుకల దానమ్మ శ్రీశైలం,వేముల నిర్మల నరసింహ, వీరు నిరుపేద కుటుంబానికి చెందినవారు రోజు కూలి నాలి చేసుకుని బ్రతికే బడుగు బలహీన వర్గాల వారు వీరి ఇల్లు రేకులతో మరియు పూరిగుడిసెతో ఒకే ఇంట్లో ఐదుగురు నివసించే బ్రతుకు జీవనం సాగిస్తున్నారు, వీరికి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు రాలేదు అని ఆయన ఆవేదన వ్యక్తం చేసినారు, రెండో విడతలో నైనా వీరికి కచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే అవకాశం కల్పించాలని ఫస్ట్ ప్రియారిటి వీళ్ళకే ఇవ్వాలని మాట్లాడినారు.

రాష్ట్ర అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లొంగిన అధికారులు ఆ పథకం యొక్క నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఇల్లు కేటాయించారని,ఒక వైపు సామాజిక న్యాయం పాటించి కుల గణన ప్రకారం ముందుకు సాగుతామని ముఖ్యమంత్రి చెబుతుంటే గ్రామాలలో నాయకుడి సామాజిక వర్గానికి సగం ఇల్లు కేటాయించడం ఎంతవరకు సమంజసం అని అన్నారు ,గ్రామంలో సెంటు భూమిలేని పేదలకు కాకుండా రాజకీయ కోణంలో ఆలోచించి వారికి కాకుండా వారి కార్యకర్తలకే ఇల్లు కేటాయించడం సరైంది కాదని,రాజకీయ నాయకుల ఒత్తిడికి లొంగి నిబంధనలు తుంగలో తొక్కిన అధికారుల పైన చర్యలు తీసుకోవాలని అన్నారు.క్షేత్ర స్థాయిలో గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగకపోవడం వలన నిజమైన లబ్ధిదారులు మోసపోయారని అన్నారు.

# ప్రైవేటు స్కూల్ దోపిడీని అరికట్టాలి

- ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి
- నోముల భానుచందర్



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్) జూన్ 12,** ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీ ని అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 2025 విద్యా సంస్థల ప్రారంభం అయిన సందర్భంగా ప్రైవేట్ విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారు, డ్రస్సు, బుక్స్, నోట్ బుక్స్, బెల్టు, టై, ఇంకా అనేక పేరు లలో విద్యార్థుల తల్లిదండ్రులను ముక్కు పిండి ఫీజు లు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యా శాఖ అధికారులు ప్రైవేటు స్కూల్ ను తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల కు విరుద్ధంగా నడిపిస్తున్న స్కూల్ పరిమిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేకుండా ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి




- మైక్రో ఫైనాన్స్ కంబంద హస్తాల్లో చిక్కుకున్న మహిళలు.
- రుణాలు మాఫీ చేయాలి.
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి,( వెంకటేష్)జూన్ 12,** మైక్రో ఫైనాన్స్ కంబంద హస్తాల్లో చిక్కుకున్న మహిళలకు రుణ మాఫీ చేయాలని , పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, గురువారం నాడు జిల్లా కేంద్రంలో మంచికంటి భవన్ లో మహిళా వ్యవసాయ కూలీల జిల్లా సదస్సు శెట్టి వినోద అధ్యక్షతన జరిగింది.ఈ సదస్సు లో ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని విమర్శించారు, వ్యవసాయ కూలీలకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ఐదు లక్షల రూపాయలు బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు, అదేవిధంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు ప్రసవ ప్రయోజనాలు కల్పించాలని, వ్యవసాయ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు,జీవన వ్యయం పెరుగుతున్నందున కూలి రేట్లు పెంచాలన్నారు, కమహిళా కూలీల సమస్యల పై రాజీలేని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో 42.6 శాతం మహిళలు పని చేస్తున్నారని వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు సంబంధించిన వారు 83 శాతం మంది భూమి లేని నిరుపేదలున్నారని తెలిపారు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసనం చేసి గుర్తింపు కార్డులు ఇచ్చి, ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు,పోడు భూముల సాగు దారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు శెట్టి వినోద, జిల్లా కమిటీ సభ్యురాలు పద్దం సుగుణ, నాగరత్నమ్మ,సౌభాగ్య, రాజేశ్వరి, దొడ్డ సావిత్రి,జబ్బ సంధ్య,నాగదుర్గ, మెస్సు రామకోటమ్మ, భారతమ్మ, జ్యోతి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రియదర్శిని డిగ్రీ కళాశాలకు 4 బంగారు పథకాలు.







**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జూన్ 12,**కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవము సందర్భంగా ప్రకటించిన బంగారు పథకాలలో స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలకు 4 బంగారు పథకాలు వచ్చినట్టు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలియజేసినారు 2016 విద్యా సంవత్సరమునకు బిఎస్సి విద్యార్థిని కాజా శ్రావణి కి, 2017 విద్యా సంవత్సరమునకు బీకాం విద్యార్థిని పబ్బ వినీతకు రెండు బంగారు పథకాలు, 2021 విద్యా సంవత్సరమునకు బిఎస్సి నుంచి బ్లేస్సి లీషా లకు బంగారు పథకాలు వచ్చినట్లు వీరికి జులై 7వ తేదీన కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం లో రాష్ట్ర గవర్నర్ బంగారు పథకాలు ప్రధానం చేయనున్నారని కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్, శ్రీరామనేని చలపతిరావు, డాక్టర్ నయీం పాషా తెలియజేసినారు ఈ సందర్భంగా పథకాలు వచ్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ నవీన్ బాబు అభినందిస్తూ ఇంతటి విజయానికి కారణమైన అధ్యాపక బృందానికి మరియు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై మట్టా దంపతుల దిగ్భ్రాంతి



**సి కె న్యూస్ ప్రతినిధి:**గుజరాత్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరియు డాక్టర్ మట్టా దయానంద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.అహ్మదాబాద్ నుంచి లండన్ వెళు _న్న విమానం జనావాసాలపై కుప్పకూలిన ఘటన తన హృదయాన్ని కలిచివేసిందన్నారు. విమాన ప్రమాదంలో ప్రయాణికులు, స్థానికులు, మెడికోలు మరణించడం అత్యంత దురదృష్టకరం అన్నారు.

మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని భరించే శక్తి బాధిత కుటుంబాలకు లభించాలని ప్రార్థించారు. చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# టి యూ సి ఐ రాష్ట్ర ప్రధమ మహాసభ జయప్రదం కొరకు పోస్టర్స్ ఆవిష్కరణ

- భవిష్యత్తు పోరాటాల రూపకల్పన కోసమే మహాసభలు
- జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి పిలుపు

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్ )జూన్ 12,** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టి యూ సి ఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను, బెస్తవారం రోజున ఎల్లన్న భవనంలో ఆవిష్కరించడం జరిగింది. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యూ సి ఐ ) రాష్ట్ర ప్రధమమహాసభ జూన్ 21,22 తేదీలో నిజామాబాదులో జరుగుతున్నాయి, ఈ సభలను జయప్రదం చేయాలని టి యూ సి ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్, యాకుబ్ షావలి,కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు కార్మికుల శ్రమను గుర్తిస్తూ, వారికి పనికి తగ్గ వేతనం, సమాజంలో గౌరవం ఇస్తున్నాయి. కానీ మనదేశంలో కార్మికుల శ్రమకు గుర్తింపు లేకపోగా అడుగడుగునా అవమానాలే. శ్రమకు తగ్గ ఫలితం అటుంచి, కనీస వేతనాల ఊసు కూడా లేదు. ముఖ్యంగా గత 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయి. బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది. కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోలేదు. పైగా వున్న ఉద్యోగాలను తొలగిస్తున్నది. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నది. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రతను దూరం చేస్తున్నది. కార్మికుల హక్కులను అడుగడుగునా కాలరాస్తున్నది. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించివేస్తున్నది. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగానే దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను తెచ్చి అమలు చేయాలని చూస్తున్నది. కార్మికుల 8 గంటల పని విధానం రద్దుచేసి, 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి, కార్మికులతో వెట్టిచాకిరి చేయించే కుట్రలు చేస్తున్నది. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యదేచ్ఛగా అమలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత కేసిఆర్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటు ఇటుగా కేంద్ర ప్రభుత్వ వైఖరినే అవలంబిస్తున్నాయి. కార్మికుల శ్రేయస్సును పట్టించుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన బాధ్యత ప్రధానంగా కార్మికవర్గం పైనే ఉన్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో, ముఖ్యంగా మన జిల్లాలో సింగరేణి మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆశ అంగన్వాడి, కేజీబీవీ, మధ్యాహ్న భోజనం, మిషన్ భగీరథ, భవన నిర్మాణ, ఆటో %ఞ% మోటార్ మరియు ఇతర రంగాలు కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం, వేతనాల పెంపు, ఉద్యోగ ఆరోగ్య భద్రత కోసం కార్మిక వర్గం రాజీలేని పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టియు సీఐ, అధ్యక్ష కార్యదర్శులు పాయం వెంకన్న మల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, బోళ్ల సీతారాములు కొత్తపల్లి రఘు, దుర్గం మహేష్ సదా, సంజీవ్, బాలాజీ నందు తదితరులు పాల్గొన్నారు




# సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సి ఎం పి ఎఫ్ జమ వివరాల పాసు బుక్కులు వెంటనే అందజేయాలి.

- ఏరియా యస్ ఓ టు జిఎం డి శ్యామ్ సుందర్ కి వినతి పత్రం అందజేసిన ఐ ఎఫ్ టి యు నాయకులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 12,** మణుగూరు ఏరియా సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సంబంధించిన కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సి ఎం పి ఎఫ్ రెండువేల ఇరవై రెండు ఏప్రియల్ ఒకటి నుండి రెండు వేల ఇరవై ఐదు మార్చి ముప్పయి ఒకటి వరకు మూడు సంవత్సరాల జమ వివరాల పాస్ బుక్ లు అందజేయాలని కోరుతూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏరియా ఎస్ ఓ టు జిఎం డి శ్యామ్ సుందర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సంబంధించి సి ఎం పి ఎఫ్ వివరాలు పాస్ బుక్ అందజేయడం లో గతంలో మణుగూరు ఏరియా ముందంజలో ఉండేదని ఇటీవల ఎందుకో జాప్యం జరుగుతోందని ఆయన అన్నారు సాంకేతిక లోపాలు ఏమైనాప్పటికీ వీలైనంత త్వరగా పిఎఫ్ పాస్ బుక్ లు అందజేయాలని అలాగే పర్మినెంట్ కార్మికుల కు ఏ విధంగానైతే ఆన్లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయో అదే విధంగా కాంటాక్ట్ కార్మికులకు కూడా ఆన్లైన్ సేవలు అందజేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు అలాగే చనిపోయిన లేదా పనులు మానివేసిన కాంటాక్ట్ కార్మికులకు చెందవలసిన రిటర్న్ వీలైనంత త్వరగా అందచేయాలని కొత్తవారికి పిఎఫ్ నెంబర్లు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు బడిలో ఉండాలి పనిలో కాదు

- న్యాయ అధికార సంస్థ చైర్మన్ జడ్జ్ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి.



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, ( వెంకటేష్ ) జూన్ 12,** గురువారం స్థానిక ఇల్లందు కోర్టు ఆవరణం నందు ప్రపంచ బాల కార్మిక నిర్మూలన దినోత్సవ సందర్భంగా ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఇల్లందు మండల న్యాయ అధికార సంస్థ చైర్మన్ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి హాజరైనారు. అనంతరం జరిగిన సదస్సులో వారు ప్రసంగిస్తూ ఈ న్యాయ సదస్సుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి మన వంతు కృషి చేయాలని వారు తెలిపారు, అదేవిధంగా చాలావరకు తల్లిదండ్రులకు వారి ఆర్థిక పరిస్థితి స్తోమత లేనందున పిల్లల్ని కూడా పనులకు పంపిస్తున్నారని, చాలామంది పిల్లలు మన కళ్ళముందే పనిచేస్తున్న చూసి చూడనట్టు ఉండడం కూడా మన తప్పు అని మనకు కూడా బాధ్యత ఉండాలని బాల కార్మికులను అని తెలిసి పనిలో పెట్టుకున్నట్లు మా దృష్టికి వస్తే యజమాని పై కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, సమాజంలో ఉంటున్నందున మనం కూడా మన వంతు బాధ్యతగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కాల్ చేసే బాధ్యత అందరి మీద ఉంటుందని ఈ సందర్భంగా తెలిపినారు, అదేవిధంగా న్యాయ చైతన్య సదస్సు ఆధ్వర్యంలో ముందు ముందు గ్రామస్థాయిలో, ఇల్లందు పట్టణస్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి సదస్సులను ఏర్పాటు చేస్తామని, ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లయితే శిక్షార్హులవుతారని, ఈనెల 14వ తారీఖున జరగబోయే జాతీయ లోక్ అదాలత్ వచ్చి రాజీ పడదగిన కేసులు పరిష్కరించుకోవాల్సిందిగా ఈ సందర్భంగా వారు తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాంపల్లి ఉమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్ న్యాయవాది పిరమిడ్ వెంకటేశ్వర్లు, కోర్టుసిబ్బంది ,పోలీస్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్పి మైనర్ లిఫ్ట్ కాలువ కట్ట ఆక్రమణ

- కట్టపై మట్టి పోసి పంట పొలం కోసం ఆక్రమణ
- అధికార పార్టీ నాయకుని ఆక్రమణదారునికి అండదండలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు,కట్ట ఆక్రమణను ఆపాలంటున్న స్థానికులు



**సీకే న్యూస్(మిర్యాలగూడ)వేములపల్లి జూన్ 12:** భూ బకాసురులు ఎన్ఎస్పి కాల్వకట్టను సైతం ఆక్రమణ చేసుకోవడానికి వెనకాడడం లేదు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుండి లిఫ్ట్ ల ద్వారా మిర్యాలగూడ మండలం
పచ్చురుగడ్డ,వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారు ప్రాంత రైతుల పొలాల పారుగంతకు నీరు పారడానికి తీసినటువంటి ఆదర్శ కాల్వ కట్టను సైతం ఒక అధికార పార్టీ నాయకుని అండదండతో స్థానిక రైతు కూతవేటు దూరంలో ఉన్న తన వ్యవసాయ భూమిలో ప్రభుత్వ అనుమతులు లేకుండ మనిషిలోతు గుంట త్రవ్వి అక్కడి నుండి త్రోలిన మట్టిని కట్టపై పోసి పక్కనే ఉన్నటువంటి తన పంట పొలంలో కలుపుకోవడం జరిగింది ఇంత.ఇది మొత్తం ఎక్కడో మారుమూల పంట పొలాలలో జరిగిన తంతుకాదు స్వయానా మిర్యాలగూడ–సూర్యాపేట రహదారికి ఆనుకుని నడుస్తున్న తంతు ఇంత జరుగుతున్నా కానీ ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్టు ఉండడం గమనార్హం.

ఆక్రమణకు గురవుతున్న ఆదర్శ కాల్వ కట్టను అధికారులు కాపాడాలి :-పచ్చారు గడ్డ గ్రామ ప్రజలు

వచ్చారు గడ్డ ప్రాంతంలోని స్థానికులు కొంతమంది ఆదర్శ కాలువ కట్టను ఆక్రమణకు గురి చేస్తున్నడంతో భవిష్యత్తులో కాలువ ద్వారా నీరు రాక ఇబ్బందులు ఏర్పడతాయని కావున అధికారులు వెంటనే స్పందించి కట్ట ఆక్రమణను నిలిపివేయాలని పచ్చారు గడ్డ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు
దీనిపై ఐబీ డిఈ జనార్దన్ రెడ్డి ని వివరణ కోరగా
ఆదర్శ కాలువ కట్ట ఆక్రమణ పై స్థానిక రైతుల నుండి ఫిర్యాదులు వచ్చాయని తక్షణమే కాలువ కట్టపై సర్వే నిర్వహించి ఆక్రమించిన కట్టను స్వాధీనపరుచుకుంటామని ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా కానీ వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తక్షణం వారిపై కేసులు పెడతామని వివరణ ఇచ్చారు

# పెంచిన బస్సు పాస్ చార్జీలను ఉపసంహరించు కోవాలి.

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 12,** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్సు పాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం బస్టాండ్ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి లు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు పాసులపై 20% నుండి 50% వరకు పెంచడం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతుందని అన్నారు. విద్యార్థుల బస్ పాస్ పై కూడా చార్జీలు పెంచడంతో సామాన్య విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందని అన్నారు. స్కూల్ ఓపెనింగ్ కావడంతో పల్లె ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు పాసుల ద్వారా వచ్చి చదువుకునే విద్యార్థులకు భారం అవుతున్నాయని అన్నారు. తక్షణమే పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం పెట్టి వచ్చిన నష్టాన్ని ఈ విధంగా చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై భారాల మోపడం సరైనది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నకరికంటి నాగరాజు, సంద్ర భూపేంద్ర, కుంజా శ్రీనివాస్, ఎస్ అజయ్ కుమార్,కోరాడ శ్రీనివాస్, ధనకొండ రాఘవయ్య, సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ, శాఖ కార్యదర్శిలు డి రామకృష్ణ,జి నాగలక్ష్మి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పినపల్లి హైస్కూల్లో పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గుండాల ఎంపీటీసీ.

- గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి.



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 12,** ఎటపాక మండలం గుండాల కాలనీలోని పినపల్లి హైస్కూల్లో 2025 - 2026 నూతన విద్యా సంవత్సరం గాను జూన్ 12వ తేదీన పిల్లలకు స్కూల్ రీ ఓపెనింగ్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా పుస్తకాలను గురువారం గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, స్థానిక సర్పంచ్ గుండి సీతా లక్ష్మి, మరియు ధనిశెట్టి సత్య నారాయణ ( ఎస్ఎంసీ చైర్మన్) చేతుల మీదగా పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ బాగా చదువుకొని ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు, మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అంతేకాకుండా జీవితంలో ఎంత ఎదిగినా తల్లి, తండ్రి, గురువు, దైవం ఈ నలుగురిని మర్చిపోకూడదని ఈ సందర్భంగా వారికి తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్క విద్యార్థి, విద్యార్థిని కూడా ప్రతిరోజు స్కూల్లో నిర్వహించే గేమ్స్ పిరియడ్ ను ఉపయోగించుకోవాలని తద్వారా శరీరక ఫిట్నెస్ మరియు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి, గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఎస్ఎంసి చైర్మన్ ధనిశెట్టి సత్యనారాయణ, స్కూల్ హెడ్మాస్టర్ శ్రీలక్ష్మి ఎస్ఎంసి సభ్యులు మరియు స్కూల్ స్టాప్ విద్యార్థిని, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య.....



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
- పాఠశాలకు ఆకర్షణీయమైన బొమ్మలతో వాల్ పెయింట్ వేయించాలి
- రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ లో మండల ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -12:** ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
గురువారం రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్ లో మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలని పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజు పిల్లలు సాయంత్రం పూట కొంత సమయం చదువుకోవాలని, కొంత సమయం ఆడుకోవాలని అన్నారు. మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు.
బాల్యంలో చదువు, ఆటలు, ఆరోగ్యం చాలా కీలకమని అన్నారు. ఇంటి భోజనంతో మంచి ఆరోగ్యం వస్తుందని, బయటి ఫుడ్ తినవద్దని అన్నారు. పిల్లలు తమ లక్ష్యాలను ఒక పుస్తకంలో రాసుకొని ప్రతి రోజూ గుర్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.
అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవులు అనంతరం సంతోషంగా పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించుకోవడం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని అన్నారు. ప్రతి వర్గానికి చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో మూతపడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తున్నామని, పాఠశాలలో అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.
ప్రతి పిల్లవాడిలో మంచి టాలెంట్ ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా పకడ్బందీగా కృషి చేస్తున్నామని అన్నారు. పాఠశాలలో ఏఐ టూల్స్ వినియోగించుకొని నాణ్యమైన ఆంగ్ల విద్య అందిస్తున్నామని అన్నారు.
ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలో మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. గతంలో వైరా మండలం నారపనేనిపల్లిలో ఒకే విద్యార్థిని ఉన్న పాఠశాలలో 20 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారని, అక్కడ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించామని అన్నారు. ఉపాధ్యాయులు చాలా నిబద్ధతతో పని చేస్తున్నారని, సమన్వయం చేసుకుంటూ పక్కాగా విద్యార్థులకు బోధన అందేలా చర్యలు చేపట్టామని అన్నారు.
అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వంట గది, పిల్లల రూంను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పూర్వ ప్రాథమిక పాఠశాల క్రింద అంగన్వాడీ పని చేయాలని, పిల్లలకు ఆట వస్తువులతో చిన్న, చిన్న పాఠాలు సిలబస్ ప్రకారం బోధించాలని అన్నారు. పిల్లల ఎదుగుదల నిరంతరం మానిటరింగ్ చేయాలని, పిల్లలకు రెగ్యులర్ గా పౌష్టికాహారం అందించాలని అన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.
ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బి. పురంధర్, రఘునాథపాలెం మండల తహసిల్దారు ఎస్. శ్వేత, ఎంపిడిఓ అశోక్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి, గ్రామ కార్యదర్శి వై. రాంబాబు, ఐసిడిఎస్. సూపర్వైజర్ జి. వెంకటలక్ష్మి, అంగన్వాడి టీచర్ జి. విజయ కుమారి, అంగన్వాడి హెల్పర్ బి. శ్రావణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారులు, కొనుగోలుదారులకు సౌకర్యవంతంగా వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా మార్కెట్ లో అవసరమైన వసతులు
- పాత బస్టాండ్ వీధి వ్యాపారుల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -12:** వ్యాపారులు, కొనుగోలుదారులకు అనుగుణంగా సౌకర్యవంతంగా వీధి వ్యాపారుల ప్రాంగణంను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
గురువారం ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్ కు కావాల్సిన అదనపు వసతులు, జరుగుతున్న నిర్మాణ పనులపై కలెక్టర్ పలు ఆదేశాలు ఇచ్చారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల ప్రాంగణంలో కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా మరిన్ని వసతులు కల్పించాలని తెలిపారు. మార్కెట్ బయట ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ ను మరొక ప్రాంతంలో ఏర్పాటు చేయాలని అన్నారు.
ప్రస్తుతం బయట ఉన్న టాయిలెట్స్ తీసివేసి, రోడ్డు నుంచి మార్కెట్ లోపలికి అందంగా ఉండేలా చిన్న ఎత్తులో గోడ నిర్మించాలని, ఆ గోడకు గ్రిల్స్ ఏర్పాటు చేసి, పార్కింగ్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.
పబ్లిక్ టాయిలెట్స్ షిఫ్టింగ్ పనులు వారం రోజులలో, మరో రెండు వారాలలో గోడ నిర్మాణం పనులు పూర్తిచేయాలని అన్నారు. వీధి వ్యాపార ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు మార్కెట్ లో ఏర్పాటు చేస్తున్న షెడ్ ల నిర్మాణం, మార్కెట్ లోపల స్త్రీ, పురుషులకు వేరు వేరుగా నిర్మిస్తున్న టాయిలెట్ నిర్మాణ పనుల పురోగతిని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మార్కెట్ లో ఉన్న వ్యాపారస్తులకు చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే విధంగా ఆర్థిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.
ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ షఫీ ఉల్లా, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం..

- ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొన్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 12,** కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామ పంచాయతీ లోని ఇప్పచెట్టు గుంపు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు దుర్గం కిరణ్ నూతనంగా నిర్మించే ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అని అన్నారు..
పేద ప్రజలకు న్యాయం జరగాలంటే అది ఒక కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రతి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారంగా ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు..
ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గాంధర్ల రామనాథం , దుర్గం కన్నయ్య కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు,యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

# ప్రత్యామ్నాయ స్థలంలో స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్ స్మశాన వాటికను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం, జూన్ -12:** ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలంలో స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
గురువారం ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్ వద్ద ఉన్న డాడీ లంబాడ స్మశాన వాటికను అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వరదల నుండి రక్షణ కోసం నిర్మించే కరకట్ట డిజైన్ లో ఎటువంటి మార్పులు, తగ్గించడం అవసరం లేదని అన్నారు. సర్వే నెంబర్ 156, 167 లో ఉన్న 30 గుంటల పట్టా భూమిలో ప్రస్తుతం స్మశాన వాటిక ఉందని, కరకట్ట నిర్మాణంలో శ్మశాన వాటిక భూమి కొంత మేరకు కోల్పోతున్నందున, క్రొత్తగా సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో శ్మశాన వాటిక ఏర్పాటు చేసి అక్కడ రోడ్డు, కాంపౌండ్ వాల్, ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.
ప్రస్తుతం ఉన్న స్మశాన వాటిక సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి వారం రోజులలో అనుకూలమైన స్థలం ఎంపిక చేసి ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తెలిపారు.
ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఖమ్మం రూరల్ తహసిల్దార్ రాం ప్రసాద్, ఎంపీడివో కుమార్ సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న పటాన్ హాజగర్ నన్నా.



**జంగారెడ్డిగూడెం లక్కవరం జూన్ 12 సీ కే న్యూస్ ప్రతినిధి,**ఏలూరు జిల్లా ,జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో మసీద్ రోడ్ లో ఉన్న అంగన్వాడి 102 సెంటర్లో అంగన్వాడీ పిలుస్తుంది . కార్యక్రమంలో పాల్గొన్న పిల్లల తల్లిదండ్రులు కూటమి ,టిడిపి నాయకులు మైనార్టీ నాయకులు పటాన్ హజ్గర్ వల్లి నన్నా ,మరియు అంగన్వాడీ హెల్పర్ సిహెచ్ వరలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ వాతావరణం లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం



**సీ కే న్యూస్ ప్రతినిధి,**గూడూరు మండలంలోని అన్ని పాఠశాలలో గురువారం నూతన విద్యా సంవత్సర ప్రారంభం ఘనంగా జరిగింది. నూతనంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఘనంగా సాగర కార్యక్రమాలు ఉపాధ్యాయులు విద్యార్థులు చేశారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలను తొలిరోజే విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలను అందంగా అలంకరించి బెలూన్లు, మామిడి తోరణాలు, రంగు కాగితాలతో పండుగ వాతావరణం లో నూతన విద్యా సంవత్సరం ఆరంభించుకున్నారు. ఎంఈఓ రవికుమార్ పలు పాఠశాలను సందర్శించి ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర ఆజాద్, ఎంఈఓ రవికుమార్ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫారాలు పంపిణీ చేశారు...

### ఇంజాపూర్ లో ఘనంగా బడిబాట కార్యక్రమం..

హాజరైన ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి..



**ఎల్బీనగర్/ అబ్దుల్లాపూర్మెట్, సీ కే న్యూస్ ప్రతినిధి,**ఇంజాపూర్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, ఏకరూప దుస్తులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మల్రెడ్డి హాజరై విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్, బాటసింగారం ఏఎంసీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత....

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- చేసిన పనులు జీవితకాలం స్థిరంగా ఉండాలి
- నగరంలోని అర్హులైన నిరుపేదలకు మొదటి దశలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 5వ డివిజన్ ఖానాపురం ప్రాంతంలో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -12:** నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.

గురువారం మంత్రివర్యులు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 5వ డివిజన్ ఖానాపురం ప్రాంతంలో పర్యటించి టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు 50 లక్షలతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజల సహకారం వల్ల ఖమ్మం నగరం పరిశుభ్రంగా ఉంటుందని, ఈ సహకారం మరింత కొనసాగించాలని మంత్రి కోరారు. ఖమ్మం నగరం ప్రజలకు మాత్రమే చెందుతుందని, కలెక్టర్, ఉన్నతాధికారులు, మంత్రులు మారుతూ ఉంటారని, ప్రజలు మాత్రం తరతరాలుగా జీవితకాలం ఇక్కడే నివసించాలి కాబట్టి మనమంతా మన నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు.

నగరంలో పరిసరాల పరిశుభ్రత, పచ్చని చెట్లు ఉండేలా చూడాలని, వీలైన చోట మొక్కలు నాటడం పట్ల ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని అన్నారు. నగరంలో గుడిసెల్లో ఉంటూ అర్హులైన కటిక నిరు పేదలందరికీ మొదటి దశలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. మురికి కాల్వల వెంబడి బతకాల్సిన అవసరం ప్రజలకు లేదని, భూమిలేని నిరు పేదలకు ప్రభుత్వ భూములలో కాలనీలు ఏర్పాటు చేస్తామని అన్నారు.

గతంలో వైయస్సార్ కాలని వద్ద పట్టాలు ఇస్తే కొంతమంది వెళ్లమని చెప్పారని, నేడు అదే ప్రాంతం అభివృద్ధి చెంది మల్టీప్లెక్స్ లు కూడా వస్తున్నాయని అన్నారు. బైపాస్ రోడ్డు వేసే సమయంలో ఇక్కడ ఎవరు లేరు ఎందుకు అని విమర్శించారని నేడు ఆ రోడ్డు సరిపోవడం లేదని అన్నారు.

నగరంలో పెరుగుతున్న జనాభా ప్రకారం అవసరమైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేయడం పాలకుల బాధ్యతని అన్నారు. డివిజన్ లో ఉన్న ప్రజలు జరుగుతున్న అభివృద్ధి పనులు సక్రమంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షించాలని అన్నారు. ఖమ్మం నగరానికి వచ్చే సంవత్సరం మరో 200 నుంచి 300 కోట్లు అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వంచే మంజూరు చేయించడం జరుగుతుందని అన్నారు.

కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ, 5వ డివిజన్ లో గతంలో కోటి రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్, డ్రైన్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, ప్రస్తుతం మరో 50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ప్రతి ఒక్కరి ఇంటి ముందు సిసి రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించాలని అన్నారు. సిసి డ్రైన్ ల మీద ర్యాంపు నిర్మాణం చేయవద్దని, ఎటువంటి ఆక్రమణలు జరగవద్దు అని అన్నారు.రాబోయే వర్షా కాలంలో మురుగునీరు పొంగి పొర్లకుండా 30 మంది పారిశుధ్య కార్మికులు, ట్రాక్టర్, జేసిబితో ప్రతి డివిజన్ లో డ్రైయిన్ శుభ్రం చేస్తున్నామని మేయర్ తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో మట్టి రోడ్డు లేకుండా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ సిబ్బంది, అధికారులు, ప్రజలకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు.

కార్పొరేషన్లు, ఎస్సీ కాలనీలు, కొత్తగా విలీనమైన ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులు చాలా కీలకమని, వీటిని నాణ్యతతో నిర్మించుకునేలా ప్రజలు, ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీఓ నరసింహా రావు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ షఫీ ఉల్లా, మునిసిపల్ ఇంజినీరింగ్ ఖమ్మం డివిజన్ కార్య నిర్వాహక ఇంజనీర్ వి. రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, కార్పొరేటర్ లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలడం, ప్రయాణికులు మృతి చెందడం బాధాకరం

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 12,**గుజరాత్ లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలడం, ప్రయాణికులు మృతి చెందడం బాధాకరమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు విచారం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియాకు చెందిన ఏ171 విమానం టేకాఫ్ సమయంలో కుప్పకూలడం అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులతో పాటు పైలెట్ సిబ్బంది మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని, అదేవిధంగా ఎయిర్ ఇండియా సంస్థ వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు...

# ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా తెలుగుదేశం నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

**ఏలూరు చింతలపూడి నియోజకవర్గం జూన్ 12 సి కే న్యూస్:**ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కామవరపుకోట గ్రామంలో కూటమి ప్రభుత్వం సు పరిపాలనకు ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా గురువారం ఎన్టీ రామారావు , విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో ,ఏలూరి హరి రామకృష్ణ హరిబాబు, ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలు మాలలు వేసి జై తెలుగుదేశం జై జై తెలుగుదేశం అంటూ నినాదాలు తీసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నేటికీ సంవత్సరం అయిన సందర్భంగా కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ,జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో కామవరపుకోట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కూటమి ప్రభుత్వం నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు



అనంతరం కేక్ కటింగ్ చేసి శ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలుపరుస్తూ వస్తున్నారని అలాగే తల్లికి వందనం కార్యక్రమం కూడా ప్రారంభిస్తున్నారని ,కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇంకెన్నో మంచి మంచి కార్యక్రమాలు చేపడుతుందని కూటమి నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో కామవరపుకోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ,ఏలూరి హరి రామకృష్ణ హరిబాబు ,మద్ది పోటి నాగేశ్వరరావు ,గంట సుధీర్ బాబు ,ఎస్కే వలి, బొంతు వెంకటేశ్వరరావు, మెరుగు సుందర్ రావు ,నల్లూరి సత్తిబాబు ,తదితరులు ,టిడిపి, జనసేన, బిజెపి నాయకులు మండలంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## అంతా ఢిల్లీ అయితే.. ఇక ఇక్కడ నిర్ణయాలు చేసేదెవరు?

తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణ జరిగి నాలుగు రోజులవుతుంది. రెండేళ్ల తర్వాత ఎట్టకేలకు మంత్రి వర్గ విస్తరణ చేపట్టారు. అదీ ఆరు పోస్టులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఖాళీగా ఉంటే మూడు పోస్టులను భర్తీ చేయగలిగారు. అదీ సామాజిక న్యాయం కోణంలో మూడు పోస్టులను భర్తీ చేశారు. ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎస్సీ మాదిగ సామాజికవర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్, బీసీ సామాజికవర్గానికి చెందిన వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ నెల 8వ తేదీన రాజ్ భవన్ లో ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులు ప్రమాణ స్వీకారం చేసి నాలుగు రోజులవుతున్నప్పటికీ ఇప్పటి వరకూ మంత్రులకు శాఖలను కేటాయించలేదు.

**చిన్న విషయాలకుకూడా...**

మంత్రులకు శాఖలకు కేటాయింపు విషయంలో కూడా ఢిల్లీ వైపు చూస్తే ఎలా? అని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మంత్రి వర్గంలో ఎవరిని తీసుకోవాలన్నది హైకమాండ్ నిర్ణయం తీసుకుంటే పరవాలేదు కానీ, శాఖల కేటాయింపులో కూడా పార్టీ అధినాయకత్వం జోక్యం ఏంటన్న ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదంటున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పుడు ప్రతి చిన్న అంశానికి ఢిల్లీపై ఆధారపడలేదన్న విషయాన్నిగుర్తు చేస్తున్నారు. హైకమాండ్ పెత్తనం ఇటీవల కాలంలో ఎక్కువయిందన్న కామెంట్స్ సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రికి కనీసం ఫ్రీ హ్యాండ్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని సెటైర్లు సోషల్ మీడియాలో కనపడుతున్నాయి.

**మూడు రోజుల నుంచి...**

మంత్రులకు శాఖలకు కేటాయింపు సహజంగా ముఖ్యమంత్రి విచక్షణాధికారానికి వదిలేయాలి. ఎవరు ఆ శాఖను సమర్థవంతంగా చేయగలరన్నది ముఖ్యమంత్రి నిర్ణయించుకుని ఆ శాఖలను కేటాయిస్తారు. కానీ శాఖల కేటాయింపు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల నుంచి ఢిల్లీలో పడిగాపులు కాయమేంటని విపక్షాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, అవసరాలు ముఖ్యమంత్రికి వదిలేస్తే ఏదైనా నిర్ణయాలు తీసుకుంటారు. అంతే తప్పించి ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడాలంటే ఎలా? అని కొందరు నెట్టింట ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల పాటు పాలనను పక్కన పెట్టి ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉండటాన్ని తప్పు పడుతున్నారు.

**రేవంత్ సర్దిచెబుతున్నా...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను మంత్రులకు శాఖలకు కేటాయింపు కోసం కాదని చెబుతున్నప్పటికీ అది నమ్మశక్యంగా లేదు. మూడు రోజుల నుంచి ఢిల్లీలో ఉన్నది కులగణన కోసమంటే ఎవరు నమ్ముతారని, ఉత్తమ్, భట్టిని ఎందుకు పిలిచారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తే సోమవారం ఉదయంపది గంటల వరకూ ముఖ్యమంత్రి హైదరాబాద్ లోనే ఉన్నారు. మరి ఎందుకు శాఖలను కేటాయించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రమాణ స్వీకారం చేసిన సాయంత్రానికే మంత్రులకు శాఖలను కేటాయించే వారని కొందరు గుర్తు చేస్తున్నారు. ప్రతి చిన్న విషయంలో ఢిల్లీ జోక్యం కూడా సరికాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

## చేపలు, కోడిగుడ్లు మంచివి

## క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

## వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.

కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.



**చేపలు**

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

**బాదం గింజలు**

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

**గుడ్లు**

కోడి గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది.

లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు. పాలకూరలోనూ ఇవి లభిస్తాయి.

**క్యారెట్లు**

క్యారెట్లలోనూ విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుంది. పైన చెప్పుకున్న ప్రయోజనాలకు అదనంగా, ఇన్ఫెక్షన్ల నుంచి కూడా విటమిన్ ఏ రక్షణనిస్తుంది.

నానబెట్టిన బాదం గింజలను రోజూ ఉదయం తినాలి

పొద్దున్నే నిమ్మరసం కలిపిన నీరు తాగాలి

స్ట్రెచింగ్ వ్యాయామాలతో నూ మంచి ఫలితాలు



# ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

**బాదం గింజలు**

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

**నిమ్మరసం కలిపిన నీరు**

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే నిమ్మరసం కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

**వ్యాయామం**

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

# ఆ టైమ్ లో బాలీవుడ్ ను వదిలేద్దామనుకున్నా



సుధీర్ బాబు హీరోగా పదేళ్ల కిందట వచ్చిన భలే మంచి రోజు సినిమాలో హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన వామికా గబ్బి ఆ తర్వాత ఇక్కడ కనిపించలేదు. వామికా ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 20 ఏళ్లవుతుంది. కెరీర్ స్టార్టింగ్ లో జూనియర్ ఆర్టిస్టుగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేసిన వామికా ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకెళ్తుంది. రీసెంట్ గా కీర్తి సురేష్ నటించిన బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వామికా గబ్బి ఆ సినిమాతో మంచి గుర్తింపే దక్కించుకుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వామికాకు ప్రస్తుతం ఆఫర్లు బాగానే వస్తున్నాయి. త్వరలోనే వామికా నుంచి వరుస సినిమాలు రానున్నాయి. భలే మంచి రోజు తర్వాత ప్రస్తుతం తెలుగులో అడివి శేష్ తో కలిసి జీ2 సినిమాలో నటిస్తోంది వామికా. ెలుగు, తమిళ, పంజాబీ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న వామికా సినిమాలతో పాటూ వెబ్ సిరీస్‌ల్లో కూడా నటిస్తోంది. రీసెంట్ గా వామికా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కింది. ప్రస్తుతం పలు భాషల్లో బిజీగా ఉన్న వామికా 2019లో బాలీవుడ్ ను వదిలి వెళ్లిపోవాలని అనుకున్నట్టు కామెంట్ చేసి అందరినీ ఆశర్చపరిచింది. అయితే బాలీవుడ్ ను విడిచి వెళ్లాలనుకోవడానికి రీజన్ ను మాత్రం వామికా బయటపెట్టలేదు. దాంతో పాటూ తాను కేవలం లండన్ వెళ్లేందుకు మాత్రమే 83 అనే సినిమాలో చిన్న క్యారెక్టర్ లో నటించానని, ఆ ఎక్స్‌పీరియెన్స్ తనలో యాక్టింగ్ పట్ల ఇష్టాన్ని పెంచిందని వామికా వెల్లడించింది. కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 83 సినిమాలో వామికా అన్ను లాల్ పాత్రలో కనిపించింది.



## చిత్రాంగద సింగ్ తన స్టైల్‌తో ఇన్‌స్టాగ్రామ్ లో వెలుగులు నింపింది



## డెనిమ్ లుక్‌లో శార్వరి అద్భుతంగా ఉంది

# దుల్కర్ వదిలేసి మంచి పని చేశాడు



కొంత మంది ఆర్టిస్టులు రిజల్ట్ తో సంబంధం లేకుండా వరుసపెట్టి సినిమాలు చేసుకుంటూ రెగ్యులర్ గా ఆడియన్స్ ముందుకు వచ్చి వారిని ఎంటర్టైన్ చేయాలనుకుంటే, మరికొంత మంది ఆర్టిస్టులు మాత్రం ఎంత టైమ్ పట్టినా పర్లేదు, ఒక్క సినిమా చేసినా దాంతో ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించాలనుకుంటారు. ఇందులో రెండవ కేటగిరీకి చెందిన వాడు దుల్కర్ సల్మాన్. దుల్కర్ సల్మాన్ సినిమాల సెలక్షన్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటాడనే సంగతి తెలిసిందే. అందుకే తన సినిమాలు అంత స్పెషల్ గా ఉంటాయి. దుల్కర్ ఇప్పటివరకు తెలుగులో మూడు సినిమాలు చేశాడు. మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్. ఈ మూడు సినిమాలూ మంచి హిట్లుగా నిలవడంతో పాటూ అందులోని ప్రతీ ప్రాత ఆడియన్స్ కు గుర్తుండిపోయేలా నటించి మెప్పించాడు దుల్కర్.

ప్రస్తుతం దుల్కర్ రానా దగ్గుబాటి ప్రొడక్షన్ లో కాంత సినిమా చేస్తున్నాడు. కాంత సినిమా గురించి ఇండస్ట్రీ వర్గాలు చాలా పాజిటివ్ గా చెప్తున్నాయి. ఇక అసలు విషయానికొస్తే గత కొన్ని సినిమాలుగా దుల్కర్ సినిమాల ఎంపిక విషయంలో ఎంతో ఆచితూచి వ్యవహరిస్తూ, ఏదైనా డౌట్ వచ్చినా సరే ఆ సినిమా నుంచి తెలివిగా తప్పించుకుంటున్నాడు తప్పించి తొందరపడి చేసి తర్వాత ఫీలవడం లేదు.

రీసెంట్ గా కమల్ హాసన్ హీరోగా వచ్చిన థగ్ లైఫ్ సినిమాలో శింబు చేసిన పాత్ర కోసం ముందు దుల్కర్ నే అనుకుని అనౌన్స్ కూడా చేశారు. కానీ అదే టైమ్ లో దుల్కర్ లక్కీ భాస్కర్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో థగ్ లైఫ్ సినిమాకు డేట్స్ అడ్జస్ట్ చేయలేక తప్పుకున్నాడు. కానీ మల్లువూడ్ మీడియా అయితే ఆ పాత్రలో సరైన జీవం లేదనే దుల్కర్ ఆ ప్రాజెక్టు నుంచి తెలివిగా తప్పుకున్నాడని అంటోంది.

అన్ని యాంగిల్స్ లో ఆలోచించే థగ్ లైఫ్ సినిమాను దుల్కర్ మిస్ చేసుకున్నాడని అంటున్నారు. థగ్ లైఫ్ లో శింబు క్యారెక్టర్ ఆడియన్స్ కు ఏ మాత్రం కనెక్ట్ అవలేదు. ఒకవేళ దుల్కర్ ఈ సినిమా చేసినా దాని వల్ల అతనికి లాభం రాకపోగా అతని కెరీర్ కు నష్టమే వచ్చేది. అందుకే థగ్ లైఫ్ సినిమాను చూసిన వాళ్లంతా దుల్కర్ ఆ సినిమాను చాలా తెలివిగా తప్పించుకున్నాడని అంటున్నారు.